## లోకసత్యాలు: ౧.

# తెలంగాణాలో తెలుగు సోదరులు

రచయిత :

భావరాజు
నరసింహారావు

[సాయంత్రం 5-30 గంటలకు: హైదరాబాదులో రెసిడెన్సీరోడ్డుమీద. విదేశీసూటు, టోపీధరించి సుబ్బారావు, పల్నాడు ఖద్దరు దుస్తుల్లో శాస్త్రి, శర్మ నడుస్తూంటారు. రోడ్డుమీద వాళ్ళకు ఎదురుపడ్డవాళ్ళలో సుబ్బారావును ఎరిగినవాళ్లు—'సలాం, సారాబ్ రావ్‌జీ' అంటూ— శాస్త్రి, శర్మలను ఎగాదిగా చూసి పోతూంటారు. రోడ్లకూడలి దగ్గర నుంచున్న పోలీసు కనుచూపు మేరదూరం వరకూ శాస్త్రి, శర్మలను అనుమానంతో చూసి, చూసి 'ఏ సి ఐ.డి. సోదరుడో వీళ్ళసంగతి కనుక్కోక పోతాడా?' అనే ఆశతో ఆచూపు మరల్చుకుంటూంటాడు. శాస్త్రి, శర్మ, రావులు యీవివయాలన్నీ గమనిస్తూనే, తమలో తాము మెల్లిగా మాట్లాడుకుంటూ సాగిపోతూవుంటారు.

ఇంతలో ఒక బట్టలషాపుముందు ఒక కారు ఆగుతుంది. అందులోంచి సుర్వా, షెర్వాణీ, కుచ్చుటోపీ, చడావులు ధరించిన ఒక ఎర్రని, సన్నని పురుషుడు దిగి దుకాణంలోకి వెళ్తాడు]

రావు.—శాస్త్రీ! ఆమనిషిని చూశావూ? ...గుర్తించావా?

శాస్త్రి:—ఆ! చూశాగానీ యిది వరకు చూసిన మొహంకాదే?

రావు:—శర్మా! నువ్వూ అంతేనా?

శర్మ:—ఆహా! (మళ్ళీ దుకాణం ముందు ఆగి, ఆవ్యక్తిని తిరిగీ చూసి) మనఊళ్ళో పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటుగా ఉన్న సాహెబు తమ్ముడు కావచ్చు—పోలిక అల్లాగేఉంది.

రావు:—కొంపతీశావు! ఆయన స్వచ్ఛమైన వైష్ణవుడు— ఆహితాగ్నుల వంశంలోవాడు! మనమంతా చాలాసార్లు చూశామాయన్ను కచాలేశ్వర అగ్రహారంలో.

శాస్త్రి:—కచాలేశ్వర అగ్రహారంలో చూశామా! బ్రాహ్మడా!...అసలు మనం చూడడంమాట అల్లాఉంచు, ఆఅగ్రహారంలో యిల్లాటి బ్రాహ్మణ్ణి అయ్యంగార్లు కాపరం చేయనిస్తారూ?

రావు:—అక్కడ కాపరం చేసినప్పుడు ఇల్లాఉండేవాడు కాదు, అక్కడెల్లా ఉండాలో అల్లాగే ఉండేవాడు—శుభ్రంగా గండభేరుండంచు పంచా, బిళ్ళగోచీ, నల్లకోటూ, జరీ తలపాగా, తీర్చి దిద్దిన నామాలూ—అన్నీ యథావిధిగానే ఉండేవి.

శాస్త్రి:—మరి యిదేం వేషం యిప్పుడు? అసలు ఏయింట్లో ఉండేవాడీయన?

రావు:—ఆ అగ్రహారంలో మన రామారావున్న యింట్లోనే అద్దెకుండేవాడు యీ ప్లీడరు. ఈయన మామగారు మా ఆఫీసు ఛీఫ్ అకౌంటెంటు—రామానుజ అయ్యంగారు. ఈయనకు మద్రాసులో బొత్తుగా కిట్టకపోవటంచేత మెల్లిగా హైద్రాబాదు పట్టించాడు, క్రిందటి సంవత్సరం. ఇప్పుడిక్కడ ఆబ్కారీ డిపార్టుమెంటులో అసిస్టెంటు అకౌంటెంటుగా ఉంటున్నాడు—నెలకు జీతం నూటయాభై కాకుండా, పైన కావలసినంత సంపాయిస్తున్నాడు.

శాస్త్రి:—ఇంతకూ ఆవేషం ఎందుకో చెప్పావు కావు.

రావు:—అదా — 'ఉదరపోషణార్థం బహుకృతవేషం.'

శాస్త్రి:—ఏం! ఆవేషం వేయని వాళ్ళంతా ఉదరపోషణ చేసుకోవటంలేదూ?

రావు:—ఆ! చేసుకుంటున్నారు నాలాగానే—పదిహేనేళ్లు పని చేసిం తర్వాత అరవై రూపాయల జీతంతో!

శర్మ:—ఆవేషం వేస్తేనే అంత లాభం ఉంటే, అంతకంటే... శుభ్రంగా ఆమాటమే పుచ్చుకో కూడదూ నువ్వు!

శాస్త్రి:— అంతదూరమెందుకు ...హాయిగా తిరపతి కొండ మొదట్లో కూచుంటే జీవనం శుభ్రంగా వెళ్ళమారదో!

రావు:— ఇదేనోయ్ మనవాళ్ళ వేదాంతం. ఏఎండ కాగొడుగు పట్టి, ఆమూణ్ణాళ్ళూ ఎల్లాగో ముక్కు మూసుకుంటే తర్వాత హాయిగా—మనయిష్టం వచ్చినట్లు—ఉండకూడదూ! చేస్తే శుద్ధ క్షౌరమే కాని...యింకేవీ పనికిరావయ్య... ఆ అయ్యంగార్ని చూశారుగా, యింట్లో ఎల్లా ఏడుస్తాడో తెలియదు గాని, బయటికొచ్చినప్పుడు మాత్రం పక్కా తురకవేషం! ఈ ఉద్యోగంలో ఉన్న పదేళ్లూ అల్లా గడిపేస్తాడు. పాతిక వేలు మూటకట్టుకుని తర్వాత శుభ్రంగా పట్టెవర్ధనాలు దిద్ది, పార్థసారధిగుళ్ళో ప్రాయశ్చిత్తం చేయించుకుంటాడు—దాసుడి తప్పులు దండంతో సరి!

శాస్త్రి:—మరి యింత ఉపన్యాసం కొట్టినవాడివి నువ్వు ఊరుకున్నావేం కుచ్చుటోపీ తగల్చకుండా?

రావు:—అవన్నీ ఆ అరవ్వాళ్ళకే సరిపోయాయి. ఉద్యోగాలూ, డబ్బూ సంపాయించటానికి ఏ పన్లైనా, ఎంత కష్టపడైనా చేయగలరు వాళ్లు, అంతేగాని మనం ఆపనులు చెయ్యాలేము, కష్టపడనూలేము...అసలు ఈ సప్తకట్ల వేషమే విధిలేక లేక వేస్తున్నాను. ఇక్కడి సాయిబులు 'సుబ్బారావు' అనకుండా 'సోరాబ్ రావ్' అని పిలిచినా, గుడ్లనీరు గుడ్లలో కుక్కుకుని 'ఆఁ' అంటున్నాను. పిల్లలకో తెలుగు చెప్పకుండా, బళ్లో తురకం చెప్పుంటే! చేసేదిలేక 'వాళ్ళ ఖర్మ' మనుకుని సరిపుచ్చుకున్నాను...

శాస్త్రి:—ఇహ చాల్లే గొడవ... (నవ్వుతూ) మీ అవ్వ తురకమంగలికే తల ఒప్పచెప్పింది గావల్ను కష్టమనుకోకుండా? మీ...(నవ్వుతూంటాడు)

శర్మ:—శాస్త్రీ! ఇంకా హాస్యమాడుతున్నావూ వాణ్ణిచూసి—వాడి దురవస్థకు బావురుమని ఏడవకుండా! మనమంతా యిల్లా 'మనకేం!' అని ఊరుకోబట్టే, మన తెలుగువాళ్ళంతా యిక్కడబ్రతకలేక మతం మార్చుకుంటున్నారు. ఒక్కసారి సరిగ్గా కళ్లు తెరిచిచూడు—పది సంవత్సరాల కింద యీరాజ్యంలో ఉన్న హిందువులలో ఎంతమంది యిప్పుడు మతం మార్చుకున్నారో! వేషం మార్చుకోవటంలో వచ్చేలాభం తాత్కాలికం, మతం మార్చుకుంటే వచ్చేలాభం శాశ్వతం—వంశపారంపర్యం!

రావు:—మన ఆంధ్రదేశంలో శాస్త్రోద్యోగాలకోసం ఎంతమంది క్రైస్తవులు కాలేదు యిదివరకు?

శర్మ:—అదే చెప్తున్నా, క్రైస్తవులు పాలించేచోట వాళ్ళలో కలిస్తేనేగాని లాభించలేదు. ఇప్పుడు, యిక్కడ కూడా ఆసూత్రమే!

రావు:—ఆసంగతి అల్లా ఉంచు. అటువంటి పెద్ద ఆశలు లేని వాళ్లు యిక్కడపడే యిబ్బందులు భగవంతుడికి తెలియాలి.

శాస్త్రి:— నిజంగా అన్నిబాధలున్నాయా యిక్కడ!

శర్మ:—శాస్త్రీ! నిన్నేమనాలో నాకు తెలియకుండా ఉంది... నిన్నేకాదు...మన ఆంధ్రదేశంలో ఎంతోమంది నీలాగే ఉన్నారు యీ విషయంలో. అసలు మనవాళ్ళకి హైదరాబాదు రాజ్యంలో తెలుగుజిల్లాలున్నాయనీ, తెలుగువాళ్ళంటూ ఉన్నారనీ, వాళ్లు యమయాతన అనుభవిస్తున్నారనీ

స్పృహే లేదు! 'ఆంధ్రరాష్ట్రం ఆరు నెలల్లో రాకపోతే చూసుకోండి...' అని ఉత్తరకుమార ప్రతిజ్ఞలు చేసేవారేగాని, 'ఆంధ్రరాష్ట్రం వచ్చేలోగా మన యిల్లు చక్కబెట్టుకుందాం, మనవాళ్ళందర్నీ ఒకచోట కూడతీద్దాం, వాళ్ళ కష్ట నష్టాలు విచారిద్దాం, తర్వాత మిగతా విషయాలు అఘోరిద్దా' మన్నమాటే లేదు మన నాయకులకూ, అనుచరులకూ కూడా!

రావు:—ఇంకెందుకూ, యిల్లాగే యింకా పదేళ్ళపాటు జరిగిపోయిందంటే, యీ రాజ్యంలో తెలుగు మాట్లాడుకునే యోగ్యతకూడా ఉండదు సరికదా, తెలుగువాడు తెలుగువాడుగా జీవించడు.

శాస్త్రి:—శర్మా! అయిందేదో అయింది కాని, యిహనుంచీ యీ రాజ్యమంతా తిరిగి మన వాళ్ళ యోగక్షేమాలన్నీ విచారిద్దాం.

శర్మ:—తప్పకుండా చేద్దాం. ఐతే అంతటితో మనపని పూర్తి కాదు, ఇక్కడి వీళ్ళ అవస్థలు మనం జీర్ణంచేసుకుని, అక్కడి మనవాళ్ళందరికీ మన తెలంగాణా సోదరుల అష్టకష్టాలూ అర్థమయ్యేట్లు ప్రచారం చేయాలి. వాళ్ళంతా వెతుక్కుంటూవచ్చి వీళ్ళందరికీ చేతనైన సహాయం చేసేటట్లు చేయాలి.

రావు:—శర్మా! ఈ ఉత్సాహం కార్యరూపం చెందినప్పుడే దాని సార్థకత. నీబోటివాళ్లు ఊరికి పదిమంది చొప్పున పట్టుదలతో యీపనిచేస్తే తెలుగుతల్లి కడుపు ఫలించినట్లే.

శాస్త్రి:—మన అరవ సోదరుల్ని చూశైనా నేర్చుకోవాలి యిల్లాంటి విషయాలు, మనం.

శర్మ:— వాళ్ళ లోపాలనుచూసి వెక్కిరించటం చాతనయినంత బాగా, వాళ్ళ మంచి మనకు పట్టుబడదుగా! అదే మనవాళ్లకున్న జాడ్యం.

రావు:—శాస్త్రీ! ఇహ యింటికి పోదాం.

[శాస్త్రి, శర్మ, రావులు తిరుగు మొహం పెట్టేసరికి, ఎదురుగా ఒక మహమ్మదీయసోదరుడు వచ్చి శాస్త్రి, శర్మలను వారి స్వగ్రామం, వృత్తి, హైదరాబాదుకు వచ్చినపని, ఎవరింటికొచ్చింది, ఎంతకాలం ఉంటేదీ వారి నడిగి ఒక నోటుబుక్కులో వ్రాసుకుని వెళ్తాడు. వాళ్లుముగ్గురూ ఒకరిమొహం ఒకరు చూసుకుని ఊరుకుంటారు.]


## బంగారుగాజులపై ఆశ వదలుడు!

మదరాసు టి. సి. యన్. 22 క్యారెట్టు రోల్డుగోల్డుగాజులుకొనుడు.




చక్కని పనితనముతో స్వల్పధరలకు లభించును. 5 సంవత్సరములు వ్రాతమూలమున గ్యారంటీ యివ్వబడును. సందేహించక వాడితీరుడు. లేదా విచారించిన లాభమున్నదా? మా చెదరేల? నేడే మా షాపును దయచేసి మీకువలయు నగలను కొని తృప్తి చెందుడు. మాయొక్క ప్రతి నగ మీద టి. సి. యన్. ముద్రయున్న సంగతి ముఖ్యముగా గమనించగలరు. ఇతరులవల్ల కట్టునగలు అనిగాని, యింకా యితరపేర్లతోగాని అమ్మేయిత్తడిరంగుగల నకిలీ నగలను, వ్యర్థపు గ్యారంటీలను, బూటకపు బహుమానములను చూచికొని మీ కష్టపుసొమ్మును పాడుచేయక అసలైన మదరాసు టి. సి. యన్. 22 క్యారెట్టు రోల్డుగోల్డు నగలను కొనుడు.

గాజులు పెద్దవి చిన్నవి అన్నిసైజులు ఒకటేధర. జత 1-కిరు 6-0-0 వి. పి. చార్జి 6 జతలవరకు రు. 0-8-0.

గాజులకు ఆర్డరు చేయువారు ఉపయోగించే గాజుల లోచుట్టుకొలత లేక అడ్డు కొలత పంపవలయును.

### టి. సి. నాగలింగప్ప అండు కంపెని,

280, వాల్టాక్సురోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

ఏజంటు:—కె. వి. రమణమూర్తి, గాంధిచౌక్, (మేడపైన) తెనాలి.